క్లుప్తంగా

లోక కల్యాణార్థం విశ్వశాంతి మహా యజ్ఞం


యజ్ఞంలో పాల్గొన్న దంపతులు

నర్సీపట్నం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం సిటీ క్లబ్ వారు ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో విశ్వశాంతి మహా యజ్ఞం ఘనంగా నిర్వహించారు. యజ్ఞ గురువు మాఘన కృష్ణమూర్తి శాస్త్రి దంపతులచే హోమం జరిపించారు. సర్వదోష నివారణకు యజ్ఞం దోహపడుతుందని కృష్ణమూర్తి శాస్త్రి పేర్కొన్నారు. ఈ యజ్ఞ క్రతువులో 108 మంది దంపతులు పాల్గొన్నారు. యజ్ఞం అనంతరం దంపతులకు ప్రసాదం అందజేశారు.

తీర్థ మహోత్సవం పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మాడుగుల: మండలం ఘాట్‌రోడ్ జంక్షన్‌లో వెలసిన మోదకొండమ్మ పాదాల తీర్థం వచ్చే నెల 2వ తేదీన నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం తీర్థ మహోత్సవం పోస్టర్ విడుదల చేశారు. తీర్థం రోజు ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. సాయంకాలం మహిళా కోలాటం, నేల వేషాలు, కాట్వాడ్ రేస్ గుర్రాల పరుగు పందేలు, కబడ్డీ పోటీలు జరుగుతాయన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని తెలిపారు.

నేడు కర్రి రామునాయుడు విగ్రహం వద్ద తీర్థం

మాడుగుల రూరల్: కె.జె.పురం-అప్పలరాజుపురం రహదారిలోని కీర్తిశేషులు కర్రి రామునాయుడు విగ్రహం వద్ద గురువారం తీర్థం నిర్వహించనున్నట్లు రామునాయుడు కుటుంబ సభ్యులు కర్రి రామకృష్ణ సోదరులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నసమారాధన జరుగుతాయన్నారు. ప్రముఖ వాగ్గేయకారుల కీర్తనలు, మధ్యాహ్నం 3 నుంచి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

నాటు సారా నిర్మూలనతోనే గ్రామాలు సురక్షితం



బేతపూడిలో అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఎస్ఐ శేఖరం తదితరులు

దేవరాపల్లి: జీవితాలు నాశనం చేసే నాటు సారాను సమూలంగా నిర్మూలించి, గ్రామాలను రక్షించుకోవాలని చోడవరం ఎక్సైజ్ ఎస్ఐ ఎం.శేఖరం సూచించారు. మండలంలోని రైవాడ పంచాయతీ బేతపూడిలో నవోదయం 2.0లో భాగంగా కళా జాత ద్వారా అవగాహన కల్పించారు. నాటు సారా సేవించడం వల్ల కలిగే దుష్పరిణాలు, సంక్రమించే రోగాల గురించి ప్రజలకు వివరించారు. నాటు సారా తయారు చేయడం, విక్రయించడం చట్ట రీత్యా నేరమని, ప్రజలంతా దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు. నాటు సారా ప్రభావం ఉన్న అన్ని గ్రామాల్లో స్థానిక పెద్దలను సభ్యులుగా ఉంచి గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. వాటి ద్వారా ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ ఎం.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కొరువాడ, కొత్తభూమి గ్రామాల్లో..

కె.కోటపాడు: నాటుసారా సేవిస్తే వ్యాధుల బారిన పడతారని చోడవరం ఎక్సైజ్ ఎస్ఐ ఎం.శేఖరం తెలిపారు. మండలంలో కొరువాడ, కొత్తభూమి గ్రామాల్లో బుధవారం రాత్రి కళాజాత ద్వారా సారా తాగడం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శేఖరం మాట్లాడుతు నాటుసారా తయారు చేసే వారిపై కఠిన చర్యలను తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఎం.అప్పలనాయుడు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్


పోలీసుల అదుపులో సారా తరలిస్తున్న వ్యక్తి

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం, బూరుగుపాలేనికి చెందిన యు. అడవులు అలియాస్ రాజుబాబు సారా తరలిస్తుండగా అప్పన్నదొరపాలెం వద్ద అదుపులోకి తీసుకున్నామని ఎక్సైజ్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. అతని వద్ద నుండి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

శివోహం


త్రిశూల పర్వతంపై వేంచేసిన బ్రహ్మలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న డీఎస్పీ శ్రీనివాసరావు దంపతులు


ధారమఠం జలపాతం వద్దకు వెళ్తున్న భక్తులు


చౌడువాడ శివాలయంలో బారులు తీరిన భక్తులు


మాడుగుల విజేపురం శివాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు


మునగపాక మండలం వాడ్రాపల్లిలో శివలింగానికి భక్తుల పూజలు

శివ రాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచే పరమ శివునికి పూజలు, అభిషేకాలు చేశారు. భక్తుల శివ నామస్మరణతో ఆలయాలు హోరెత్తాయి. నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేశారు.



మార్మోగిన శివ నామస్మరణ..


పెద్దమిల్లు జంక్షన్‌లోని వామలింగేశ్వర స్వామి సన్నిధిలో భక్తులు

మాకవరపాలెం: మండలంలోని పురాతన శివాలయాలుగా పేరొందిన పెద్దమిల్లు జంక్షన్ లోని వామలింగేశ్వర, పి.పి.అగ్రహారంలోని అమృతేశ్వర, గిడుతూరులోని గంగాధరేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వయంభూ లింగమైన వామలింగేశ్వర ఆలయానికి భక్తుల తాకిడి అధికమైంది.


అనకాపల్లి వేల్పులవీధి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 12 అడుగుల శివుని విగ్రహం


చోడవరం శివాలయంలో నందీశ్వరుని చెవిలో కోర్కెలు చెప్పుకుంటున్న భక్తులు

శివనామస్మరణతో హోరెత్తిన ఆలయాలు

పెద్ద ఎత్తున భక్తుల పూజలు

నర్సీపట్నం: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా నర్సీపట్నం బలిఘట్టం ఉత్తరవాహిని నది ఒడ్డున త్రిశూల పర్వతంపై వేంచేసిన శ్రీ బ్రహ్మలింగేశ్వరస్వామి పుణ్యక్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పుణ్యస్నానాలు ఆచరించి శ్రీబ్రహ్మలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అలాగే పవిత్ర పుణ్యక్షేత్రమైన పాకలపాడు గురుదేవుల ఆశ్రమంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే శివరాత్రి ఉత్సవాలకు ఏజెన్సీ ప్రాంతాల నుండి గురుదేవుల భక్తులు, గిరిజనులు ఆశ్రమానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారి ఆలయ సమీపంలో భక్తుల సౌకర్యార్థం వేములపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి సేవలు అందించారు. సత్యసాయి సేవా సమితి, వాసవీ క్లబ్ ప్రతినిధులు భక్తులకు పులిహోర, మజ్జిక అందజేశారు. మున్సిపల్ కమిషనర్ సురేంద్ర దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వి.బి. అగ్రహారంలో..

నాతవరం: మండలంలోని వి.బి. అగ్రహారంలో గల పురాతన శివాలయం, చమ్మచింత గ్రామంలో తాండవ నది ఒడ్డున ఉన్న శివాలయంలో భక్తులు పరమ శివునికి ఘనంగా పూజలు చేశారు. అలాగే వెదురుపల్లి, జిల్లేడుపూడి, సిద్ధిపట్నం, మర్రిపాలెం, నాతవరం, చిక్కుడుపాలెం గ్రామాల్లోని శివాలయాల్లో కూడా భక్తుల కోలాహలం కన్పించింది.

ధారమఠం.. కృష్ణదేవిపేటలో..

గొలుగొండ: ధారమఠం, కృష్ణదేవిపేటలోని నీలకంఠేశ్వరస్వామి, గొలుగొండలో వీరభద్రస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, గొలుగొండ ఎస్ఐ ఎం. రామారావు ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

శివునికి ప్రత్యేక పూజలు..

కె.కోటపాడు: ఎ.కోడూరులో భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి, కె.కోటపాడులో గల భీమలింగేశ్వరాలయం, చౌడువాడలో గల కాశీ విశ్వేశ్వరాలయం, ఆనందపురం, సింగన్నదొరపాలెం, లంకవానిపాలెం గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్లి గ్రామంలో భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామికి రుద్రాభిషేకాలు జరిపారు. ఆలయాల వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

మాడుగులలో..

మాడుగుల: స్థానిక ఉబ్బలింగేశ్వర, శ్రీకృష్ణభూపాలేశ్వర, భీమలింగేశ్వరాలయాలతో పాటు జాలంపల్లి పంచాయతీ పిట్టగెడ్డలో పాండవులు ప్రతిష్ఠించిన ఉమా భీమలింగేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. విజేపురంలో వెలసిన శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

పరమ శివునికి పవిత్ర పూజలు..

మాడుగుల రూరల్: కె.జె.పురం చెరకు కాటా వద్ద గల ఉమా భీమలింగేశ్వర స్వామి ఆలయం, ఎం. కోడూరు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం, వీరవల్లి అగ్రహారంలోని ఉమా భీమలింగేశ్వర స్వామి ఆలయం, విస్సారపు వారి కళ్లాల వద్ద గల నీలకంఠేశ్వర స్వామి వారి ఆలయం, వంటర్లపాలెం శివాలయం, కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గల మహంకాళేశ్వర స్వామి ఆలయంలో శివునికి పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. అలాగే వీరనారాయణం, విజేపురం, పిట్టగెడ్డ శివాలయాల్లో శివునికి పెద్ద ఎత్తున పూజలు జరిగాయి.


ఎం.కోడూరు కాశీ విశ్వేశ్వరుని ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


వడ్డాది బజారు వీధి శివాలయంలో భక్తుల రద్దీ

హరహర మహాదేవ..

చోడవరం: ప్రాచీన దేవాలయాల్లో ఒకటైన చోడవరం స్వయంభూ గౌరీశ్వరాలయంతో పాటు మూడు నదులు కలిసే ముద్దుర్తి సంగమేశ్వర ఆలయం, జుత్తాడలో స్ఫటిక లింగేశ్వరస్వామి, మూడు నందులతో శోభిల్లే గవరవరం శివాలయం, 300 ఏళ్ల చరిత్ర ఉన్న వెంకన్నపాలెం భోగలింగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు శివునికి ఘనంగా పూజలు చేశారు. ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు, దేవదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి సత్యనారాయణ మూర్తి, ఆలయ అభివృద్ధి కమిటీ గూనూరు సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. వాసవీక్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం, మజ్జిగ, మంచినీరు సరఫరా చేశారు. గోవాడ, రాయపురాజుపేట, జుత్తాడ, గవరవరం, గౌరీపట్నం శివాలయాల్లో కూడా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

శంభో.. శివ శంభో..

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది, బుచ్చెయ్యపేట, రాజాం, నిమ్మలోవ, విజయరామరాజుపేట, దిబ్బిడి, సీతయ్యపేట, చిట్టియ్యపాలెం, తైపురం, పంగిడి, బంగారుమెట్ట తదితర గ్రామాల్లో భక్తులు శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. వడ్డాది కొత్తూరు శివాలయం వద్ద జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. నిమ్మలోవ నాగలింగేశ్వరస్వామి ఆలయం వద్ద వెయ్యి మందికి ఉచిత అన్నదానం చేశారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి: మండలంలోని తిమిరాం, ఎం.అలమండ, బోయిలకింతాడ, వేచలం, పెదనందిపల్లి, చిననందిపల్లి, దేవరాపల్లి శివాలయాల్లో భక్తులు పరమ శివునికి పూజలు చేశారు. దేవరాపల్లిలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. భారీ అన్నసమారాధనలో మహా ప్రసాదాన్ని స్వీకరించారు.

రోలుగుంట కాశీ విశ్వేశ్వర మృత్యుంజయ ఆలయంలో..

రోలుగుంట: కాశీ విశ్వేశ్వర మృత్యుంజయ ఆలయంలో భక్తులు పరమ శివునికి పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త పిల్లి చిన్నారావు ముందుగా అష్టోత్తర శివలింగాలను సుగంధ ద్రవ్యాలతో శుద్ధి చేశారు. వైఎస్సార్‌సీపీ మాజీ యాత కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పిల్లి సుజాత శివలింగాలను శుద్ధి చేసి స్వామివారిని దర్శించుకున్నారు. కొమరవోలు, కె.నాయుడుపాలెం, కొవ్వూరు తదితర గ్రామాల భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

వేడుకగా శివ పూజలు..

చీడికాడ: మండలంలోని ఖండివరం, బి.సింగవరం, కె.ఎల్.బి.పట్నం, తురువోలు, చీడికాడ శివాలయాల్లో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. తురువోలులో జిల్లా స్థాయి గుర్రం పరుగు పోటీలు, ఖండివరంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. రాత్రి భజన, సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళల కోలాటం వంటివి నిర్వహించారు.


కె.జె.పురంలో శివ పూజలకు విచ్చేసిన బూడి ముత్యాలనాయుడును సత్కరిస్తున్న నాయకులు


తిమిరాం శివాలయంలో బారులు తీరిన భక్తులు


రోలుగుంట కాశీ విశ్వేశ్వర మృత్యుంజయ ఆలయంలో శివలింగాలను శుద్ధి చేస్తున్న యాత కార్పొరేషన్ మాజీ స్టేట్ డైరెక్టర్ సుజాత తదితరులు

వైభవంగా పోతురాజుబాబు తీర్థం


మామిడి వారి కళ్లాల వద్ద బూడిని సత్కరిస్తున్న రైతులు


ఒడ్డు చింతల కళ్లాల్లో దేవుళ్లమ్మ పేరంటాలను దర్శించుకుంటున్న బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: తాచేరు నది సమీపాన మామిడివారి కళ్లాల వద్ద వెలసిన పోతురాజుబాబు తీర్థాన్ని రైతులు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పోతురాజుబాబును దర్శించుకున్నారు. రైతులు ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం భారీ అన్న సమారాధన, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, శీలామంతులు వాసు, జవ్వాది వరహాలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పేరంటాల తీర్థ మహోత్సవాలు..

దేవరాపల్లి: దేవరాపల్లి శివారు ఒడ్డు చింతల కళ్లాల్లోని దేవుళ్లమ్మ పేరంటాలు, కొల్లివారి కళ్లాల్లో శ్రీనివాసమ్మ పేరంటాలు, తగరంపూడి వారి కళ్లాల్లో నాగమ్మ పేరంటాల తీర్థ మహోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. అమ్మవార్లకు మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పూజలు చేశారు. ఆయనతో పాటు కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, వైఎస్సార్‌సీపీ ఆర్టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వరదపురెడ్డి లలితానాయుడు, వేచలపు అప్పలనాయుడు తదితరులు అమ్మవార్లను దర్శించుకున్నారు. అలాగే మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు తదితరులు ముగ్గురు పేరంటాల అమ్మవార్లను దర్శించుకున్నారు. ఒడ్డు చింతల వారి కళ్లాల్లో జరిగిన జిల్లా స్థాయి ఎడ్ల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

వేడుకగా వేంకటేశ్వర స్వామి కల్యాణం రాట

బుచ్చెయ్యపేట: ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెందిన వడ్డాది శ్రీ వేంకటేశ్వరస్వామి 152వ కల్యాణ మహోత్సవానికి దేవస్థానం వంశ పారంపర్య ధర్మకర్త దొండా కన్నబాబు, ఈవో శర్మ, గ్రామ పెద్దల సమక్షంలో పెళ్లిరాట వేశారు. శ్రీదేవి, భూదేవితో జరిగే వేంకటేశ్వర స్వామి ఐదు రోజుల కల్యాణానికి ప్రతి సంవత్సరం మహా శివరాత్రి పర్వదినాన పెళ్లి రాట వేయడం ఆనవాయితీగా వస్తోంది. మార్చి 9 అర్ధ రాత్రి వేంకటేశ్వర స్వామి కల్యాణానికి అంకురార్పణ, దొంగ పెళ్లి నిర్వహించి 14వ తేదీన నాగవల్లి వసంతోత్సవం వరకు కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తామని ధర్మకర్త, ఈవో శర్మ తెలిపారు. ఎమ్మెల్యే రాజు, దొండా సన్యాసిరావు, కుబిరెడ్డి వెంకటరావు, వీర్ల సురేష్, సయ్యపురెడ్డి సత్యనారాయణ, అడపా నరసింహమూర్తి, సత్తి సత్యనారాయణరెడ్డి, పాలిమేర కృష్ణ, సయ్యపురెడ్డి కొండబాబు పాల్గొన్నారు.


వేంకటేశ్వర స్వామికి పెళ్లి రాట వేస్తున్న భక్తులు, నాయకులు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

బుచ్చెయ్యపేట: మండలంలోని ఎల్‌బీపీ అగ్రహారంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైంది. సానబోయిన అప్పారావు ఈ పూరింట్లో నివశిస్తున్నారు. తన భార్యతో కలిసి పొలం పనులకు వెళ్లగా మంటలు చెలరేగాయి. ఇంటిపై భాగంలో ప్లాస్టిక్ కవరు కప్పి ఉండటంతో మంటలు లోపలికి వ్యాపించాయి. మంటలను అదుపు చేయడానికి స్థానికులు ప్రయత్నించారు. చోడవరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారొచ్చి మంటలు అదుపు చేశారు. సుమారు రూ. 2 లక్షల 50 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అప్పారావు తెలిపారు. ఫ్యాన్, బీరువా, బట్టలు, వంట సామగ్రి ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి.


ప్రమాదంలో దగ్ధమైన పూరిల్లు

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

బుచ్చెయ్యపేట: ఉపాధ్యాయ ఎన్నికకు సంబంధించి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌కు బుధవారం సాయంత్రం సామగ్రితో సిబ్బంది వచ్చారు. ఈ బూత్‌ను స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో ఏర్పాటు చేశారు. 33 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తహసీల్దార్ లక్ష్మి తెలిపారు. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని ఆమె తెలిపారు.

నేడు మాడుగుల బాలుర హైస్కూల్లో..

మాడుగుల: ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం స్థానిక బాలుర హైస్కూల్లో జరగనున్నాయని తహసీల్దార్ రమాదేవి, ఎన్నికల డీటీ రాజా తెలిపారు. ఉదయం 8 నుండి సాయంకాలం 4 గంటలు వరకు పోలింగ్ జరగనుందన్నారు. 55 మంది ఓటర్లు 86 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్నారన్నారు. ఇప్పటికే పోలింగ్ సిబ్బంది కేంద్రానికి చేరుకున్నారని, పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

ఎన్నికలకు పూర్తయిన ఏర్పాట్లు..

దేవరాపల్లి: మండలంలో గురువారం జరిగే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎన్నికకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దేవరాపల్లి మండలంలో 63 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా, ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. దేవరాపల్లి పోలింగ్ కేంద్రానికి పీవో, ఏపీవో, ఇద్దరు పోలింగ్ అధికారులు ఎన్నికల సామగ్రితో బుధవారం చేరుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు బిఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ అమలు ఉంటుందని స్థానిక ఎస్ఐ టి.మల్లేశ్వరరావు స్పష్టం చేశారు. కాగా ఎన్నికల ఏర్పాట్లను బుధవారం ఎస్ఐ టి.మల్లేశ్వరరావు, అదనపు ఎస్ఐ పి.రాములమ్మ, డిప్యూటీ తహసీల్దార్ కె. అప్పారావు, ఆర్ఐ ఎన్. సతీష్, వీఆర్‌వో నాగేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.


బుచ్చెయ్యపేట పాఠశాలకు సామగ్రితో చేరుకున్న పోలింగ్ సిబ్బంది

పోలింగ్ కేంద్రం పరిశీలన..

నర్సీపట్నం: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నర్సీపట్నం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో వి.వి.రమణ బుధవారం పరిశీలించారు. పోలింగ్ బూత్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. బూత్‌లో 417 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించినట్లు ఉదయం 8 గంటలకే పోలింగ్ ప్రారంభం కావాలని, సాయంత్రం నాలుగు గంటల తర్వాత వచ్చిన వారిని అనుమతించకూడదన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రామారావు ఉన్నారు.


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో వి.వి.రమణ


పోలింగ్ జరగనున్న కె.కోటపాడు హైస్కూల్

పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

కె.కోటపాడు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక గురువారం జరగనున్న నేపథ్యంలో మండలంలో గల ఉపాధ్యాయులు ఓటు వినియోగించుకునేందుకు కె.కోటపాడు హైస్కూల్లో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ 107 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్ ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహించనున్నట్లు ఎన్నికల నిర్వహణ అధికారులు పేర్కొన్నారు.

ఆలయానికి పంచలోహ తలుపులు విరాళం


పంచలోహ తలుపులు అందజేస్తున్న దాతలు

మాడుగుల రూరల్: ఎం. కోడూరు గ్రామ దేవత మోదమాంబ ఆలయానికి గ్రామానికి చెందిన దాతల సహకారంతో పంచలోహ తలుపులు తయారు చేసి సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు చేతుల మీదుగా బుధవారం అందజేశారు. గ్రామానికి చెందిన గోకాడ గంగరాజు, కొండలరావు, అప్పాన రమణబాబు, అప్పాన చిన్నంనాయుడు, అప్పాన రవి ఆర్థిక సహకారంతో రూ. 50 వేలు విలువ చేసే పంచలోహ తలుపులు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు, మాజీ సహకార సంఘం అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, కొండలరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.